# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**ఆలోచిస్తూంటే** ఒకటే మాకు అర్థం అయింది. పైకి కనిపించని యీ వేదన మానసిక రోగంలాంటిది ఏదో ఆమెలో ఉంది. అది ఎవరూ ఆఖరికి ఇంట్లో వాళ్ళుకూడా కనిపెట్ట లేక పోయారు.

ఆమె ఓ బలహీన క్షణంలో తీసుకున్న బలహీనమైన నిర్ణయం. అదే ఆత్మహత్యకి దారి తీసింది. ఆ బలహీన క్షణం దాటితే,ఆ నిర్ణయం అంతగా బలపడేది కాదు. అలాంటి బలహీన క్షణాలు రాకుండా ఉండాలంటే,ఇంట్లో వాళ్ళ సపోర్ట్ ఉండాలి. ఏదో ఒక యావోగేషన్ ఉండాలి. అది మనిషి ఒంటరి తనాన్ని దగ్గరికి రానీదు.

అందుకని అలాంటి వాళ్ళూ మరీ ఒంటరితనంతో బాధ పడుతూంటే అనాధాశ్రమాలకి, వృద్ధాశ్రమాలకి వెళ్ళి అక్కడి వాళ్ళతో కొంచెం సమయాన్ని గడిపితే వాళ్ళముందు తామెంత అదృష్టవంతులో తెలుసుకుంటారు. కాని వాళ్ళకి ఎవరు సలహా ఇస్తారు. ఎవరో ఒకళ్ళు చెప్పాలి. ఆ ఎవరో అంటే మానసిక వైద్యులు, వాళ్ళే సలహా ఇవ్వగలరు.

అప్పుడే అనుకున్నాను, నేను ఇలాంటి చదువునే చదవాలి, ఇలాంటి మానసిక రోగులకి సాయ పడాలి అని. అదే నేను సైకియాట్రి చదవడానికి కారణం అయింది. నా ధ్యేయం ఈ ఆత్మహత్య చేసుకోవాలి అన్న బలహీనత ఉన్నవాళ్ళకి సాయపడడం. ఆ బలహీన క్షణాలు దాటాలంటే ఏదో ఒక మంచి హాబీని కల్టివేట్ చేయించాలి, తనని తాను మర్చిపోయేలాంటి ఓ చక్కటి యావోగేషన్ ఉండేలా చేయాలి. అన్నింటికీ మించి ఒంటరితనం దగ్గరికి రాకుండా చేయాలి.

మనసులో ఉన్నది చెప్పుకోడానికి ఎవరూ లేరు, ఫీలింగ్స్ పంచుకోడానికి ఎవరూ లేరు,అని అనుకున్న వాళ్ళు నేను ఒంటరిని, నాకీ లోకంలో ఎవరూ లేరు,అన్న భావం వచ్చిందంటే ఏ రోజునైనా ఆత్మహత్య చేసుకుంటారు. ఈ ఒంటరితనం మూలంగానే కదా మనసులో ఉన్నవి చెప్పుకుని పంచుకునేంత దగ్గర వాళ్ళు ఎవరూ లేరనే ఫీలింగ్ తోనే కదా సినిమా వాళ్ళల్లో చాలా మంది సూసైడ్ చేసుకుంటూంటారు. ఈ ఒంటరితనాన్ని ఎలా దూరంచేసుకోవాలన్నది ఎవరికి వారే ప్లాన్ చేసుకోవాలి. లేకపోతే డాక్టర్లని అడగాలి సలహా తీసుకోవాలి.

ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళంతా దారుణమైన స్వార్థపరులు. మా క్లాస్మేట్ కూడా అంతే. జీవించి ఉండడం వేస్టనుకుంది.

జంతువులు ,చెట్లు ఆత్మహత్య చేసుకోవు. ఒక్క మనిషి మాత్రమే చేసుకోగలడు. కారణం ఏంటో తెలుసా. మనసు. ఈ విశ్వం లో మనిషికి మాత్రమే ఆ సౌకర్యం ఉంది. కాని అసలు ఆ మనసుకే ఎసరు తెస్తూంటే ఏంటీ దాని ప్రయోజనం.?

జీవితం ఓ గొప్ప వరం. మన మనసు అనే బంతిని ప్రపంచం అనే గోడకి కొట్టినప్పుడే బతుకు అనే ఆట ఏ స్పీడ్ లో ఆడాలో తెలుస్తుంది. ఆ పనిని ఆపేయడం ఆత్మహత్య. ఆపకుండా ఆటని అలా ఆడుతూ ఉంటే స్థితప్రజ్ఞత అవుతుంది. ఆ స్థిత ప్రజ్ఞత వచ్చినప్పుడు

ఆత్మహత్య, అనేది మనసులోకి రానే రాదు. అందుకే ఈ లక్షణాలున్న వాళ్ళని కాస్త గమనిస్తే ఈ ఆత్మహత్యలని ఆపచ్చు. విలువైనవాటిని అవి ఏదైనా జీవితం కానీ మరోటి కానీ,అలా తృణప్రాయంగా పారేసుకోకూడదు. విలుపైన దానిని అనుభవించాలి దాచుకోవాలి ,కాని, పోగొట్టుకోకూడదు " అతని గొంతులో జీర.

"అయ్యో.....ఐయామ్ సారీ...." నాకేం ఇంక చెప్పాలో తెలీలేదు.

"అలా అనకు.ఆమె మరణం నన్ను స్ట్రాంగ్ చేసింది. నేను ఏం చెయ్యాలో, నా లక్ష్యం ఏంటో తెలిపింది. నన్ను ఓ డాక్టర్ని చేసింది. నేను ఓ మామూలు డాక్టర్ని కాను. ఓ పెద్ద పేరు పొందిన డాక్టరుగా నన్ను తయారు చేసింది. కాదు ,అలా నా జీవితాన్ని నేను తయారు చేసుకున్నాను. నా గురించి ఆలోచించు కున్నాను కాబట్టి నలుగురికి సాయపడేలా నన్ను చేసింది. నేను అలాంటి దారిని ఎంచుకున్నాను. నన్ను అలా ఉండేలా చేసిన ఆమెకి మనసులోనే దండం పెట్టుకుంటాను. "

"ఆమె అంటే మీకు..."

"అభిమానం. ఆ వయసులో నేను ప్రేమించిన మొదటి అమ్మాయి ఆమె . నామొదటి లవర్. ఆమెని మర్చిపోలేదు. అందుకే నా పేషెంట్లతో మాట్లాడటప్పుడు దేవుడిని తలుచుకుంటాను, ఆ అమ్మాయిలాగా కాకుండా వీళ్ళు మంచి మార్గాన వెళ్ళాలి "

మరి నేను, నా సంగతి ఏంటీ. నా ప్రేమ ఏంటీ . నిజంగా నేను ప్రేమించానో లేదో ఆ సంగతి నాకు తెలీదు కానీ ముగ్గురు నా జీవితంలోకి వచ్చారు. వాళ్ల ఎవర్నీ నేను మర్చిపోలేదు.

" ఇప్పుడు నువ్వు నీ గురించి ఆలోచించుకోవాలి. నువ్వు కాలేజీ మానేసావంటే, అన్నీ ,అంతా అయిపోయిందని అనుకోకు. చదువు ఒక్కటే జీవితం కాదు. అదే నీ జీవితానికి ఆఖరు కూడా కాదు.జీవితంలో ఎన్నో చేయచ్చు. ఎన్నో ఉన్నాయి.అదే ఆలోచించుకోవాలి. ఆలోచించడం మొదలు పెట్టు. నా ఆలోచనలు నన్నునీలాంటి ఓ నలుగురికి సాయపడేలా చేసాయి. అందుకే ఈ క్షణం నుంచే నీ గురించి ఆలోచించు. ఏంచెయ్యాలో ,ఏంచేస్తే బావుంటుందో ఆలోచించు "

మొదటి సారి నాకు ఓ ఛాయిస్ ఇస్తూ మాట్లాడిన మనిషి నా ఎదురుగా ఉన్నారు. మొదటి నుంచి నాకు ఓ ఛాయిస్ ఇవ్వాలని మా వాళ్ళు ఎప్పుడూ కూడా అనుకోలేదు. అన్నీ వాళ్ళు చెప్పిందే చేసాను అందులో ఇంతటి నిరుత్సాహం ఉందన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే డాక్టరుగారు మాట్లాడాకా నాకు నిజంగా నా మీద ఉత్సాహం పెరిగింది. నా మీద కన్నా నా జీవితం మీద అనే చెప్పచ్చు.

నేను నా ఆలోచనలో ఉండగానే డాక్టరు గారు వెళ్ళి పోయారు.

ఇప్పుడు ఆయన నాకు ఇచ్చింది జీవితాన్ని గురించిన ఇన్ ఫర్మేషన్ కాదు, జీవితం ఎలా ఉండాలో , దానికి ఏం చెయ్యాలో అనే ఓ ఆలోచనకి ఓ చిన్న విత్తనం వేసి వెళ్ళారు. ఇప్పుడు నేను చేయాల్సింది ఒకటే, నేనే మట్టినయి, కొద్దిగా కొద్దిగా నీరు పోసి వేరు నుంచి పైకి లాక్కుని రావాలి . పూల మొక్కని పెంచాలి. అది నాలో ఓ చిన్న ఆశా కిరణం కనిపిస్తోంది. ఆ తలుపు సందుల్లోంచి నా వైపు ప్రసరిస్తోంది.

ఇన్ని నెలల తరవాత నేను నా భవిష్యత్తు గురించి ఇప్పుడు ఆలోచించాలి. ఏంచేయాలి ? అసలు ఏం చెయ్య గలను ?

ఇదివరకు ఏం చేసానో గుర్తు లేదు. ఇన్ని ఏళ్ళూ ఏం చేయకుండానే ఇంత పెద్దగా అయ్యానా ఏదో చేసాను. కానీ ఏం చేసానో గుర్తు లేదు. గుర్తు రాకపోతే నేను ముందుకి ఎలా వెళ్తాను?

చదవడం రాయడం ఎప్పుడో మానేసాను. అసలు అక్షరాలు కూడా మర్చిపోయానేమో అన్న భయం ఇంకా ఎన్నో భయాలు. మర్నాడు డాక్టరు గారు వచ్చినప్పుడు నా భయాలు అన్ని చెప్పుకోవాలి. ముఖ్యంగా నేను నా చదువు గురించి...

రాత్రి ఎప్పుడవుతుందా. ఎప్పుడు తెల్లారుతుందా, అని ఎదురు చూసాను. నాకు తెలిసి ఈ మధ్య కాలంలో ఇదే మొదటి సారి సూర్యోదయం కోసం ఎదురు చూడడం. అది కూడా . ఎంతో ఉత్సాహంగా ఎదురు చూడడం. ఎందుకంటే ఎప్పుడూ నిద్రే. ఎప్పుడు సూర్యుడు వస్తున్నాడో ఎప్పుడు వెళ్ళిపోతున్నాడో తెలీదు. ఇప్పుడు ఈ ఎదురు చూస్తుంటే టైము గడవడం లేదనిపించింది. ఉదయం ఎప్పటికీ రావడంలేదని ఎప్పటికీ తెల్లారడం లేదని మొదటి సారి గమనించాను.

డాక్టరు గారు రాగానే నా మనసులో ఉన్న ఆలోచనలు అన్నీ చెప్పాలి అని అన్నాను. ఆయన నా తల మీద చేయి వేసి నిమిరారు. అందులో చెప్పు అన్న అర్థం ఉంది. డాక్టరుగారు నాకు చాలా దగ్గరయ్యారు. ఆయనతో నిస్సంకోచంగా ఎన్నో చెప్పగలుగుతున్నాను.

" నా గురించి ఆలోచించి నప్పుడు, కొన్ని అనుమానాలు నన్ను చుట్టుముట్టాయి. ఆ అనుమానాలు, నా భయాలు మీకు చెప్పుకోవాలి డాక్టరు గారూ , మొదటిది నేను చదవడం ,రాయడం . ఆ రెండూ చేయలేక పోతున్నాను.ప్రయత్నించాను. కానీ అది ఇదివరకూ లాగా చేయలేక పోతున్నాను . ఎంతో చదవాలని ఉంది కాని ,చదవలేక పోతున్నాను. ఏమో ముందు ముందు కూడా ఇలాగే ఉండచ్చు. నా భావి జీవితానికి కావలిసిన ఈ రెంటిని నేను చేయలేకపోతే , అప్పుడు జీవితాంతం ఇక్కడే ఉండాల్సి వస్తుందేమో,నేను పాత శృతిలాగా చదవడం రాయడం చేయగలిగితేనే కదా నేను ముందుకు వెళ్ళేది."

డాక్టరుగారు తలని అడ్డంగా ఊపుతూ నవ్వారు. "ఆ భయం నీక్కర్లేదు . నువ్వు ఇక్కడ ఉంటానన్నా మేము ఉండనివ్వము. నిన్నుఇక్కడినుంచి నేనే పంపిస్తాను.నిన్ను సంపూర్ణ ఆరోగ్యవంతురాలిలా తయారు చేస్తాం. ఆ విధంగా తయారు చేస్తాం "

" నన్ను ఆరోగ్యవంతురాలిలా తయారు చేసి మీరు పంపించినా లాభం ఏం ఉంటుంది డాక్టర్...నేను ఇక్కడి నుంచి వెళ్ళాకా ఏం చేయగలను? అసలు ఏం చేస్తాను ? "

డాక్టరు గారు,తన చేతి వేళ్ళతో అక్కడున్న టేబుల్ మీద చిన్నగా కొట్టారు.

" సరిగ్గా ఇదే నేను కూడా అనుకున్నాను. ఇక్కడి నుంచి వెళ్ళాకా నువ్వు ఏం చేయగలవని, అందుకే నేను ముందే ఊహించాను , నీలో ఇలాంటి భయాలుంటాయని, దానికి జవాబు కూడా సిద్ధంగా ఉంది.

నీకు ఇప్పుడు బాగానే ఉందంటున్నావు, మాకు కావలసినది కూడా అదే. అయితే మేము నీకు మందులు రాసి ఈ మందులు వాడు, ఆ తరవాత నెల కో సారి రమ్మని అనం. అది కేవలం డాక్టరు పేషెంటు బంధం మాత్రమే.అది మాకిష్టం లేదు. కాని మనది అలా కాదు.అలా చేయడం నా కిష్టం లేదు. నీ భవిష్యత్తుని మేము తీర్చాలి కదా. అది చేయలేనప్పుడు ఇక్కడ వైద్యం చేయించుకుని లాభం ఏం ఉంది ? అందుకే దానికి ఏం చేయాలన్నది కూడా ఆలోచించాము.

ఏది చేసినా మేము నీవైపు నుంచి కూడా చూడాలి. నీ శక్తి ఎంత వరకూ సహకరిస్తుందో కూడా గమనించాలి. మానసికంగా అస్తవ్యస్తంగా ఉన్ననువ్వు ఇప్పుడిప్పుడే కొంచెం కొంచెంగా తేరుకుంటున్నావు. నీకు పూర్తిగా తగ్గి పోలేదు. ఇంత వరకు జరిగినది మొదటి మెట్టు మాత్రమే. ఇంకా నువ్వు ఎక్కాల్సిన మెట్లున్నాయి. అందుకని నిన్ను ఇక్కడి నుంచి డైరెక్ట్ గా ఇంటికి పంపించము.

ఇక్కడనుంచి నిన్ను మరో వింగ్ కి పంపిస్తాము. అక్కడ నీకివ్వబోయే థెరపీ నీకు అన్ని విధాలా నయం చేస్తుంది. ఆ ప్రోగ్రాం కూడా ఈ కాంపస్ లోనే ఉంది. అది నీకు అన్ని విధాలా తోడ్పడుతుంది. అప్పుడు నీకు గతం అంతా ఓ పీడకలలా అనిపిస్తుంది ”

నాలో ధైర్యాన్ని పంప్ చేసారు.అయితే ఓ సందేహం వచ్చింది . ఈ డాక్టరు గారు అక్కడికి వస్తారా అని. ఎందుకంటే ఆయన నా జీవనరేఖ. ఆయన ఆక్సిజన్ లాంటి ఆశని నాలో చిగురింప చేసారు. ఆయనని చూడకుండా మాట్లాడకుండా ఎలా ఉండ గలను. అదే విషయాన్ని ఆయననే అడిగేసాను.

డాక్టరు గారు తలని చిన్నగా అడ్డంగా ఊపారు.

“ అక్కడ వేరే డాక్టర్లుంటారు.ఆ వింగ్ ఇంచార్జి కూడా వేరే ”

నేను ఒక్కసారి కుంగిపోయాను. డాక్టరు ని చూడకుండా ఎలా ! ఆయనతో మాట్లాడకుండా ఎలా డాక్టరుగారితో మాట్లాడడం నా రొటీన్ లో ఓ భాగం అయిపోయింది. అది ఆయనకి అర్థం అయినట్లుంది. చిన్నగా పెదవులు విడకుండా చిరునవ్వుతో చూసారు.

“నా రౌండ్లు పూర్తయ్యాక నేను రోజూవస్తాను. అది నీకోసం ”

అతని మాటలు నాకు ఎంతో సంతోషాన్ని కలిగించాయి.ముఖ్యంగా నీ కోసం. అన్న మాట. అంత పెద్ద మనిషి, నాకోసం ఆ వింగ్ లో పని లేక పోయినా, నా కోసం వస్తానంటున్నారు. ఆ ఒక్క పదం దానిలోఎంతో బలం ఉన్నది. ఎంతో శక్తి ఉంది. ఆ సంతోషంలో ఆనందంగా డాక్టరు గారిని చూసాను. ఆనందంలో పెదవుల విడకుండా చిరునవ్వు నవ్వాను.

“నువ్వు ఇలాగే ఎప్పుడూ చిరునవ్వుతూ ఉండాలి. నీ మొహం ఇలాగే వెలుగుతూండాలి నవ్వుతూంటే నువ్వు బావుంటావు, అద్దంలో ఓసారి నిన్ను నువ్వు చూసుకో ”

ఆయన మాటలకి ఒక్క సారి నా గుండె సంతోషంతో పొంగిపోయింది. వెంటనే మొహం అద్దంలో చూసుకోవాలనిపించింది. చిరునవ్వుతో మొహం వెలుగుతూంటూంటే ఎలా ఉంటుందో.

డాక్టరుగారు వెళ్ళాకా నవ్వు మొహం పెట్టి, నన్ను నేను అద్దంలో చూసుకున్నాను. ఇది వరకూలాగా లేకపోయినా నా మొహం బాగానే ఉన్నట్లనిపించింది. అద్దం అబద్ధం చెప్పదు. కాబట్టి నేను బావున్నాను.

మరో వింగ్ కి వెళ్ళడానికి మానసికంగా తయారయి పోయాను. నేను మామూలుగా ఆరోగ్యంగా ఉండాలంటే వీళ్ళు చెప్పినది చెయ్యాల్సిందే. పైగా డాక్టరు గారు వస్తానని అన్నారు కూడా. నాలాంటి వాళ్ళని బాగు చెయ్యడమే ఓ ఛాలెంజ్ గా తీసుకున్నారు. అలాంటప్పుడు నేను పూర్వపు శృతి లాగా తప్పకుండా అయిపోతాను. అయిపోవాలి.

మరో నాలుగు రోజులకి నన్ను మరో వింగ్ కి మార్చారు.

ఇది వేరేగా ఉంది ఇదివరకూ ఉన్న ప్రపంచానికి భిన్నంగా ఉంది. మెయిన్ బిల్డింగ్  నుంచి చాలా దూరంలో ఉంది. పైగా అంతా చెట్లు. పెద్ద చెట్లు ,ఎండ రాకుండా నాలుగు వైపులకి వ్యాపించిన గొడుగు లాంటి చెట్లు. వాటి కింద చిక్కగా దట్టంగా పెరిగి అల్లుకుపోయిన గడ్డి, పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు, అది ఓ హాస్పటల్ లాగా అనిపించడం లేదు. ఏదో గెస్ట్ హౌస్ లాగా ఉంది. ఓ రిసార్ట్ లాగా ఉంది. ఈ మూల నుంచి ఆ మూల వరకూ ఉన్న పొడుగాటి బిల్డింగ్. ఒకటే అంతస్తు. దాని ముందు లాన్లు, పూల మొక్కలు, పూలు పూయని క్రోటను మొక్కలు. ఎటూ చూసినా పచ్చదనం. కళ్ళకి హాయిగా అనిపించింది.

నన్ను తీసుకెళ్ళి, నా గది చూపించారు. అంతకు ముందున్నగదిలో ఒక్క మంచం మాత్రమే ఉంది. ఇంకేమీ లేదు. కానీ ఇక్కడ ,మామూలుగా ఓ హాస్పటల్ లో ఉండే గదిలాగా ఉంది. ఓ సీలింగ్ ఫాను. రెండు సింగిల్ మంచాలు. ఓ టేబుల్, ఓ కుర్చీ, పెన్నులు పెనసళ్ళు. ఓ పుస్తకం. టేబుల్ పైన గోడకి ఓ ఛార్ట్ తగిలించి ఉన్నది. ముందు నేను దాన్నిపట్టించు  కోలేదు.

నాతో వచ్చిన సిస్టర్ ఆ చార్ట్ ని చూపిస్తూ అంది.

“అందులో మీరు ఏం చెయ్యాలో , టైము టేబుల్ ,అంతా రాసి ఉంటుంది. మీకు అర్థం కాకపోతే మేము చెప్తాం. మేము గుర్తు చేస్తాం. మీకు అన్ని విధాలా సాయం చేస్తాం ”

ఆ చార్ట్ ని చూసాను కాని చదవలేక పోయాను.ఆ సిస్టర్ నిఅందులో ఏం ఉందో చదవ మన్నాను.

అలాగే అన్నట్లుగా చిరునవ్వుతో నన్ను చూసి చదివింది.

దానిమీద నా పేరుంది. డాక్టరుగారి పేరుంది. దాని కింద ఏ టైముకి ఏం చెయ్యాలో వివరంగా రాసి ఉంది.  ఇది మీ టైం టేబుల్ . ఉదయం నడక ,బ్రేక్ ఫాస్ట్, రిక్రియేషన్, మధ్యాహ్నం భోజనం, రెస్ట్,తోటపని, సైకో థెరపీ,  కౌన్సిలింగ్. లైబ్రెరీ, యోగా, రెస్ట్,  భోజనం, నిద్ర.ఆ తరవాత ఆమె వెళ్ళి పోయింది.

ఆశ్చర్యం వేసింది. టైం టేబుల్ అంటే నాకు తెలిసినవి రెండు. క్లాసు ,పీరియడ్లూ,సబ్జెక్టులు. అది స్కూల్లో. ఇంట్లో టైం టేబుల్ వేరేగా ఉంటుంది. ఏ సబ్జెక్ట్ ,ఎంత సేపు.ఏరోజు ఎన్ని సబ్జెక్ట్లు. కానీ ఈ టైం టేబుల్ వేరేగా ఉంది. కొత్తగా ఉంది.

టైం టేబుల్ చదివాకా, ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను. ఇన్ని రోజులు ఏం చేసాను? టైం ఎలా గడిపాను ? ఏం చేసాను ? ఏం చెయ్యలేదు   రోజులు గడిచాయి.  కాని ఇందులో ఉన్న విధంగా మాత్రం గడప లేదు. ఈ ఛార్ట్ లోఉన్నట్లుగా మాత్రం చెయ్యలేదు. ఖాళీగా కూచోడం, పడుకోవడం, లేకపోతే కిటికీ లోంచి చూడడం. మొద్దులా తయారైన నేను ఇప్పుడు బిజీగా ఉండగలనా! ఇందులో రాసి ఉన్నట్లుగా చేయగలనా ?అలా ఉంటే బాగానే ఉంటుంది .  ఏదో ఓ దినచర్య.  ఖాళీగా ఉండక్కర్లేదు.  చదవక్కర్లేదు. పరీక్షలూ,మార్కులూ ,ప్రెషర్స్ ఏం ఉండవు.

నాకు చూపించిన గదిని నాకు అలాట్ చేసిన దానిలో సెటిల్ అయ్యే సరికి పదకొండు అయిపోయింది.

రిక్రియేషన్ టైము అని ఓ మనిషి వచ్చి చెప్పి వెళ్ళి పోయాడు. నా గదిలోంచి బయిటికి వచ్చాను.

ఈ రిక్రియేషన్ లో  ఏం ఉంటుందో, తెలీదు. అదేదో చూద్దామని వెళ్ళాను. ఆ గది కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. అది ఓ పెద్ద గదిలా ఉంది. ఓ పక్కన టీవీ ,సోఫాలు,మరో పక్కన పుస్తకాలు ,పేపర్లు, అవీ ఉన్న ఓ టేబుల్ . దాని చుట్టూ కుర్చీలున్నాయి. అక్కడ  ఓ వయసు మళ్ళిన అతను  చదువుతూ కనిపించారు.

పేపర్లు మాగజైన్లున్నాయి. పేపరు చదివితే. అక్కడ ఉన్నపేపర్లలో ఒకటి తీసుకుని చూసాను. అక్షరాలు చూసినట్లుగా అనిపిస్తున్నాయి. కానీ ఏ అక్షరం ఏంటో తెలీడం లేదు. ఓ పదినిమిషాలు అతి కష్టం మీద చదివాను. కానీ నాకేం అర్థం కాలేదు. ఆ పేపర్ ని,అక్కడే పెట్టేసి, లేచాను.

“ కూచో . నీకు చివరకు మిగిలేది చెప్పాలి “  అంటూ తన పక్కనున్న కుర్చీ చూపించి కూచోమన్నట్టు చేత్తో సైగ చేసారు. మనిషి రంగు చామన ఛాయ. పైజామా లాల్చీ ,వయసు ఓ డెబ్బై వరకూ ఉండచ్చు. ముందు జుట్టు లేదు. బట్టతల. మందపాటి కళ్ళద్దాలు.

నాకు ఏం అర్థం కాలేదు. చివరకు మిగలేది ఏంటో , ఎవరి చివరకు మిగిలేది. దేని గురించి మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. కూచున్నాను.

“చివరకు ఏం మిగలదు. ఈ గుప్పిట మూసుకుంటే లోపల ఏం ఉందో తెలీదు. తెరిస్తే అంతా శూన్యం. అంతే మన జీవితాలు అంతే. నీదైనా అంతే. నాదైనా అంతే. ఇప్పుడు అసమర్థుడి జీవయాత్ర చదివితే అందులో మనమే కనపిస్తాం. అంతా మనో వైజ్ఞానికం అనుకో . నామటుక్కు నేను దాన్ని  పది సార్లైనా చదివాను, విశ్వనాధ సత్యనారాయణ పుస్తకాలు చదివావా“

చదవలేదన్నాను. నా సమాధానికి ఆయన పెద్ద ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఇంత వరకూ నాతో మాట్లాడిన అతను ఎవరో నాకు తెలీదు. నేనెవరో అతనికి తెలీదు. సాహిత్యం అంటే ఇష్టం ఉంది కాబట్టి, అతని మాటలు వినడానికి బాగానే ఉన్నాయి. పైగా నా స్పందనల కోసం ,జవాబుల కోసం అతను ఏం ఆగలేదు. అతనలా పుస్తకాల గురించి మాట్లాడుతూనే ఉన్నాడు. నేను వింటున్నానో లేదో కూడా గమనించడం లేదు. నేను అక్కడినుంచి వెళ్ళడం కూడా గమనించ లేదు.

నాకు దేని మీద ఇంట్రెస్ట్ ఉందో నాకు తెలీదు. పేపర్లూ, పుస్తకాలు  కష్టం. చదవడం ఇబ్బంది. ఓ మూల ఉన్న పెద్ద కిటికీకి దగ్గరకి వెళ్ళాను, అక్కడ ఓ ఈసల్ , దాని పక్కన ఓ టేబుల్ దానిమీద తెల్ల కాగితాలూ, ఆ పక్కనే రంగులు, బ్రష్ లు ,అన్నీ ఉన్నాయి. అక్కడ ఎవరూ లేరు. ఇది ఓ మానసిక రోగులుండే ప్రదేశం అని ఎవరూ అనుకోరు. ఓ మనిషి మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి ఇలాంటివి అవసరం అని చెప్పే ప్రదేశం. ఇలాంటి హాబీలుండాలి. ఒకప్పుడు నాకూ ఉండేవి ,కానీ, ఇప్పుడు ఏం లేదు. అన్నీ మర్చిపోయాను.ఇప్పుడు కూడా ఏదో వేసెయ్యాలన్న ఉత్సాహం కూడా లేదు.అందుకే అక్కడి నుంచి కదిలాను.

ఈ గది ఓ మనిషి మానసికంగా ఆరోగ్యంగా తయారవడానికి ఇది ఏర్పరిచిన దారి. ఇక్కడ ఉన్నవాళ్ళంతా పైకి బాగానే కనిపిస్తున్నారు. వీళ్ళుఏవో పరిస్థితుల వల్ల నా లాగా అయ్యారా. అందుకే ఈ దార్లోంచి నడుస్తున్నారా.

నాకేం చేయాలో తెలీలేదు, మిగిలిన చోట్లకి వెళ్ళాలని లేదు. ఎక్కడికో వెళ్ళి  అక్కడెవరుంటే వాళ్లని పరిచయం చేసుకుని, ఆ పరిచయాన్ని  పెంచు కోవాలని లేదు. అందుకని నాలుగువైపులా చూసి నడుస్తూ అలా డ్రాయంగ్ పేపర్లున్న చోటుకి వెళ్ళాను. ఏదో చెయ్యాలి. ఆలోచించాను. అక్కడున్న రంగుల్ని బ్రష్ ల్ని చూసి కొంచెం వెనకాడాను.

ఒకప్పుడు ఇవి నాకెంతో ఇష్టమైనవి. బాగా చిన్నప్పుడు అమ్మ బలవంతం మీద డ్రాయింగ్ పెయింటింగ్ క్లాసులో చేరాను. మొదలు పెట్టాకా క్లాసులు ఎంతో ఉత్సాహాన్ని కలగ చేసింది. మొదటి రోజు వెళ్ళినప్పుడు , అక్కడ రంగు పెన్సిళ్ళతో సీనరీ వేసినప్పుడు కలిగిన లాంటి ఆనందమే ఇంకా ఏమీ వేయకుండానే ఇప్పుడు కూడా కలిగింది. అప్పుడు ఎలాంటి భావోద్వేగానికి లోనయ్యానో కూడా గుర్తొచ్చింది. ఎంతో సంతోషంగా ఉత్సాహంగా ఉండేదాన్ని. మళ్ళీ ఆ ఆనందం ఉత్సాహం అవన్నీ తిరిగి వస్తాయా! పోనీ ఓసారి వేస్తే ప్రయత్నిస్తే. ఆ ఆలోచనకే చేతులు వణికాయి. ఏదో భయం.

చాలా సేపు అలాగే నుంచున్నాకా నాలోని భయం కొంచెం తగ్గాకా , ధైర్యం చేసి ముందుకి వెళ్ళి ఓ సారి రంగుల్ని పేపర్లని చూసి, పెయింట్ చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. బ్రష్ పట్టుకుని తెల్లకాయతం కేసి చూసాను. ఒక లాంటి ఫీలింగ్.

ఏది వెయ్యాలి ఏం వెయ్యను కిటికీలోంచి చూసాను. చైత్ర మాసం. గుత్తులు గుత్తులుగా ఉన్న ఎరుపు రంగు పూలతో, ఆకుపచ్చని ఆకులతో చక్కటి కాంట్రాస్ట్ తో ఉన్న గుల్ మోహర్ కొమ్మలు కనిపించాయి. ఎండ ఆ పూల కొమ్మల మీద పడుతోంది. ఆకులు ,పూలు మెల్లిగా ఊగుతున్నాయి. అది వేస్తే బాగుంటుదనిపించింది. పదో క్లాసులో, ఇంటర్ లో, బీఎస్సీలో బాటనీ, జువాలజీ రికార్డ్ లో దయాగ్రంస్ ఎంతో నీట్ గా వేసి, లేబిలింగ్ చేసే దాన్ని.

ఈ క్షణాన అవి గుర్తొచ్చాయి. ఎంతో శ్రద్ధగా వేసాను. రికార్డ్ లో ఎప్పుడూ ఫుల్ మార్క్స్, ఆ రోజులు గుర్తుకి రాగానే కుంచించుకు పోయాను. నాలో ఎంత మార్పు. ఆ మార్పుని కనిపెట్టడానికి ఎనిమిది నెలలు పట్టింది. అందుకే ఇప్పుడు ఇలా ఇక్కడ. ఈ ఆసుపత్రిలో.

చేయలేను అని అనుకోకు, నువ్వు మనసులో గట్టిగా అనుకుంటే అన్నీ చేయగలవు. అది మొదటి మెట్టు. అన్న డాక్టరు గారి మాటలు గుర్తొచ్చాయి.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments